ముఖ్యమంత్రి కార్యాలయము

తెలంగాణ ప్రభుత్వం

పత్రికా ప్రకటన-2 23, డిసెంబరు, 2014

ఎన్‌టిపిసి, తెలంగాణ జెన్‌కొ ఆధ్వర్యంలో నల్గొండ జిల్లా దామరచర్ల మండలం వీర్లపాలెం, దిలావర్‌పూర్‌లలో 7600 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం కలిగిన థర్మల్ పవర్ స్టేషన్లను ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు నిర్ణయించారు. మంత్రులు, అధికారులతో కలిసి ముఖ్యమంత్రి మంగళవారం దామరచర్ల మండలంలోని రిజర్వు ఫారెస్టు ప్రాంతంలో ఏరియల్ సర్వే నిర్వహించారు. కాలి నడకన కూడా కలియతిరిగి ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. విద్యుత్ ఉత్పత్తి కేంద్రం స్థాపనకు ఈ స్థలం అత్యంత అనుకూలమైనదిగా నిర్ణయించారు. హైదరాబాద్ తిరిగి వచ్చిన తరువాత విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల స్థాపనపై సమీక్ష నిర్వహించారు.

- ఎన్‌టిపిసి ఆధ్వర్యంలో తెలంగాణలో 4000 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి జరగాల్సి ఉంది. కరీంనగర్ జిల్లా రామగుండం ఎన్‌టిపిసి ఉన్న ప్రాంతంలోనే 1600 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి జరుగుతుంది. దీనికి సంబంధించిన పనులు ప్రారంభం అయ్యాయి.

- ఎన్‌టిపిసి ఆధ్వర్యంలో మిగిలిన 2400 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తికి దామరచర్ల మండలంలో ప్లాంట్లు నెలకొల్పడానికి స్థలం ఇవ్వాలని ముఖ్యమంత్రి నిర్ణయించారు.

- తెలంగాణ జెన్‌కో ఆధ్వర్యంలో 6000 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో 270 మెగావాట్ల విద్యుత్ సామర్థ్యం కలిగిన నాలుగు యూనిట్ల (మొత్తం 1080 మెగావాట్లు) సామర్థ్యం కలిగిన విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్లను ఖమ్మం జిల్లా మణుగూరు దగ్గర రామానుజాలపల్లిలో బిహెచ్ఇఎల్ నిర్మిస్తున్నది. ఈ పనులు రెండేళ్లలో పూర్తయి విద్యుత్ అందుబాటులోకి వస్తుంది. మిగతా దాదాపు 5000 మెగావాట్ల విద్యుత్

ఉత్పత్తి చేయడానికి కూడా దామరచర్ల మండలంలోని స్థలం అత్యంత అనువైనదని ముఖ్యమంత్రి నిర్ణయించారు.

–జెన్‌కో ఆధ్వర్యంలొ 800 మెగావాట్ల ఉత్పత్తి సామర్థ్యం కలిగిన  అయిదు యూనిట్లు (మొత్తం 4000 మెగావాట్లు), 600 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం కలిగిన రెండు యూనిట్లు (మొత్తం 1200 మెగావాట్లు) దామరచర్ల మండలంలో స్థాపించాలని ముఖ్యమంత్రి నిర్ణయించారు.

ఇలా జెన్‌కో ఆధ్వర్యంలో 5200, ఎన్‌టిపిసి ఆధ్వర్యంలో 2400 మెగావాట్ల (మొత్తం 7600 మెగావాట్లు) విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం కలిగిన థర్మల్ స్టేషన్లను దామరచర్ల మండలంలో నెలకొల్పుతారు. దామరచర్ల మండలంలోని దాదాపు 7800 ఎకరాలు అటు కృష్ణా నదికి, ఇటు రైల్వే ట్రాక్‌కు సమీపంలో ఉన్నాయి కాబట్టి థర్మల్ స్టేషన్ల స్థాపనకు అత్యంత అనుకూలమని ముఖ్యమంత్రి చెప్పారు. ఈ భూమిలో రిజర్వు ఫారెస్టు కూడా ఉన్నందున కేంద్ర పర్యావరణ శాఖ మంత్రి ప్రకాష్ జవదేకర్‌తో ముఖ్యమంత్రి సమీక్షా సమావేశం నుండే ఫోన్లో మాట్లాడారు. తాము విద్యుత్ ప్లాంట్ల కోసం ఎంత అటవీ భూమిని వినియోగించుకుంటామో, అంత మొత్తంలో మరో చోట అటవీ శాఖకు భూమి కేటాయిస్తామని ముఖ్యమంత్రి చెప్పారు. అనుమతులు త్వరగా ఇవ్వాలని కోరారు. దీనికి కేంద్రమంత్రి సానుకూలంగా స్పందించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదనలు అందిన వారం రోజుల్లోగా అనుమతులు ఇప్పిస్తామని కేంద్ర మంత్రి హామినిచ్చారు. తానే స్వయంగా ప్రతిపాదనలు తీసుకొని జనవరి మొదటి వారంలో ఢిల్లీకి పోవాలని ముఖ్యమంత్రి నిర్ణయించారు. ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్ల స్థాపనకు వెంటనే పూర్తి స్థాయి ప్రాజెక్టు నివేదిక (డిపిఆర్) తయారు చేయాలని జెన్‌కో అధికారులను ఆదేశించారు. కృష్ణా నుండి నీటి కేటాయింపులు జరుపుతామని ముఖ్యమంత్రి చెప్పారు.

దాదాపు 7800 ఎకరాల స్థలంలో 7600 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలు రావడం వల్ల నల్గొండ జిల్లాకు ఎంతో మేలు కలుగుతుందని ముఖ్యమంత్రి అన్నారు. దాదాపు 55 వేల కోట్ల రూపాయల పెట్టుబడులు వస్తాయన్నారు. 20 నుండి 30 వేల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని, పవర్ ప్లాంట్లు నెలకొల్పే చోట అద్భుత పట్టణాలు వెలుస్తాయని ముఖ్యమంత్రి చెప్పారు.

ఈ కార్యక్రమాల్లో విద్యుత్ శాఖ మంత్రి సి. లక్ష్మారెడ్డి, విద్యాశాఖ మంత్రి జగదీష్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రాజీవ్‌శర్మ, సిఎంఓ ముఖ్య కార్యదర్శి నర్సింగరావు, కార్యదర్శులు స్మితాసబర్వాల్, భూపాల్‌రెడ్డి, జెన్‌కో ఛైర్మన్ ప్రభాకర్‌రావు, నల్గొండ జిల్లా కలెక్టర్ చిరంజీవులు తదితరులు పాల్గొన్నారు.

---

సిపిఆర్‌ఓ టు సిఎం